క్లుప్తంగా

ఎంపీడీఓ సాయిబాబాకు అభినందనలు



ఎంపీడీఓ సాయిబాబాను అభినందిస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి తదితరులు

పెదపూడి: పెదపూడి ఎంపీడీఓగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సాయిబాబాను ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, గ్రామ సచివాలయ కార్యదర్శుల అసోసియేషన్ అధ్యక్షుడు యాళ్ల ఉమామహేశ్వరరావు తదితరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. సాయిబాబాకు శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, బి.ప్రసన్నాంజనేయులు, శిరీష, సుబ్రహ్మణ్యం, సుంకర వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ పీఎస్‌గా కిరణ్‌కుమార్

రాజానగరం: మండలంలోని పాలచర్ల పంచాయతీ కార్యదర్శి (పీఎస్)గా విధులు నిర్వహిస్తున్న కోలా కిరణ్ కుమార్‌కు దివాన్ చెరువు పంచాయతీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ డీఎల్‌పీఓ జె.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కిరణ్‌కుమార్ మంగళవారం ఇన్‌చార్జిగా పీఎస్‌గా బాధ్యతలు స్వీకరించారు. దివాన్ చెరువు పీఎస్‌గా ఉన్న సత్తిరాజును సీతానగరం మండలానికి బదిలీ చేశారు.

ఆయుష్మాన్ భారత్ స్పెషల్ డ్రైవ్

బిక్కవోలు: మండలంలోని సచివాలయాల్లో బుధవారం ఆయుష్మాన్ భారత్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జేఏ ఝాన్సీ అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్డు కలిగిన వారికి ప్రభుత్వం లేదా ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.5 లక్షల వరకూ ఉచితంగా చికిత్స చేయించుకోవచ్చన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి కార్డు అందిస్తామన్నారు.


పీఎంపీలకు పోస్టల్ బీమా

గోకవరం: మండలంలోని పీఎంపీ అసోసియేషన్ సభ్యులకు రాజమహేంద్రవరానికి చెందిన బీవీఎస్ హాస్పిటల్ సహకారంతో పోస్టల్ డిపార్టుమెంట్ యాక్సిడెంట్ బీమా పాలసీ చేయించారు. సుమారు 50 మంది సభ్యులకు మంగళవారం గోకవరంలో స్థానిక ఈశ్వర్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ జిల్లా కోకన్వీనర్ బళ్లా శ్రీనివాస్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పీఎంపీలకు పోస్టల్ బీమా కల్పించడంపై కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు పి.చిన్ని, అధ్యక్షుడు ఎమ్.నాగేశ్వరరావు, కార్యదర్శి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

దుప్పలపూడి సర్పంచ్ సస్పెన్షన్

అనపర్తి: మండలంలోని దుప్పలపూడి సర్పంచ్ నల్లమిల్లి సావిత్రిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కె.మాధవీలత ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి తెలిపారు. పంచాయతీ నిధులు దుర్వినియోగానికి సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై సర్పంచ్ సావిత్రి సరైన సంజాయిషీ ఇవ్వకపోవడంతో వచ్చే ఏడాది జనవరి 29 వరకూ సర్పంచ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. సర్పంచ్ సస్పెన్షన్ కాలంలో గ్రామ ఉపసర్పంచ్ వల్లభశెట్టి శివపద్మిని ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. అక్టోబరు 30 నుంచి ఉపసర్పంచ్ శివపద్మిని సంతకంతో జారీ చేసిన చెక్కులను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని సబ్ ట్రెజరీ, సంబంధిత బ్యాంకు మేనేజర్లను ఆదేశిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారని ఎంపీడీఓ తెలిపారు.

గోకవరంలో అన్నసంతర్పణ



దేవీచౌక్ ఆలయం వద్ద జరుగుతున్న అన్నదానం

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయం వద్ద మంగళవారం భారీ అన్నదానం జరిగింది. శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కంబాల శ్రీనివాస్‌రావు, గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుమారు ఏడు వేల మంది పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ మాట్లాడుతూ ఈ ఏడాది అమ్మవారి ఉత్సవాలు ఘనంగా ముగిశాయన్నారు. దీనికి సహకరించిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ఎంపీపీ లచ్చారెడ్డి మృతి



కర్రి లక్ష్మీనారాయణరెడ్డి(ఫైల్)

అనపర్తి: అనపర్తి మాజీ ఎంపీపీ కర్రి లక్ష్మీనారాయణరెడ్డి(లచ్చారెడ్డి)(58) మంగళవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం విషమించడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు.

ప్రజాభిమానమే శ్రీరామరక్ష

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అట్టహాసంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



అభిమానుల మధ్య కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులను గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

అనపర్తి: ప్రజాసేవలో తరించాలనే ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చిన తనకు ప్రజాభిమానమే శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక గంగిరెడ్డి నర్సింగ్‌హోమ్ ఆవరణలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి 62వ జన్మదిన వేడుకలు మంగళవారం పార్టీ నాయకులు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటుచేసిన కేక్‌ను ఆయన కట్ చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పలువురు ప్రముఖులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అనపర్తి తరలి వచ్చి ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేలాదిగా తరలివచ్చిన జన సందోహంతో స్థానిక మెయిన్‌రోడ్డు, జన్మదిన వేడుకలు నిర్వహించిన గంగిరెడ్డి నర్సింగ్ హోమ్ ప్రాంగణం కిక్కిరిసింది. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా పలువురు అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పలువురు గజమాలలు, దుశ్శాలువా, పూల కిరీటం, జ్ఞాపికలను ఎమ్మెల్యేకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జీవితాంతం రుణపడి ఉంటాను

పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్రజలకు సేవ చేయాలనే తలంపుతోనే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. తనను ఆదరిస్తున్న నియోజకవర్గ ప్రజలకు, అభిమానులకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసేవారు పూలదండలు, పుష్పగుచ్ఛాలు బదులుగా ఎమ్మెల్యే దంపతులు ఏర్పాటు చేసిన వైఎస్సార్ పుస్తక నిధికి పుస్తకాలు అందించాలన్న ఎమ్మెల్యే, పార్టీ నాయకుల పిలుపుకు విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నల్లమిల్లి అచ్యుతరామారెడ్డి, ఎన్‌సీఆర్ మురళి, ఎస్.భాస్కరరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎంపీపీలు అంసూరి సూర్యనారాయణ(బుజ్జి), రిమ్మలపూడి శ్రీదేవి, కేతా తులసి, కొవ్వూరి జ్యోతిర్మయిశేషకుమారి సత్యనారాణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు సత్తి గీతావరలక్ష్మి, పేపకాయల వెంకటలక్ష్మి, పేపకాయల రాంబాబు, రొంగల పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు నల్లా శ్రీనివాస్, పోతుల ప్రసాదరెడ్డి, గుత్తుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతిపై ఎంపీడీవో రామారావు బదిలీ



ఎంపీడీవో రామారావును సన్మానిస్తున్న ఉద్యోగులు

రాజానగరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) సోషల్ ఆడిట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్‌గా స్థానిక ఎంపీడీఓ బి.రామారావు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను మండల ప్రజాపరిషత్ కార్యాలయం సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు మంగళవారం ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని, అనుభవాలను పంచుకున్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాలులో ఎంఈఓ- 1 రామన్నదొర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు అనదాస సాయిరామ్, డీఎల్‌పీఓ జె.సత్యనారాయణ, స్పెషల్ ఆఫీసర్ వీణాదేవి, తహసీల్దార్ పవన్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సునీత, రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి, పంచాయతీరాజ్ డీఈ రవికుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ 2 జ్యోతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నా భూమి - నా దేశం



నా భూమి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో మంగళవారం నాభూమి - నాదేశం, ఫిట్ భారత్ స్వచ్ఛ రన్ కార్యక్రమాలు జరిగాయి. వీటిని ప్రారంభించిన రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశం కోసం అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ నాభూమి, నా దేశం కార్యక్రమం చేపట్టామన్నారు. ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులలో దేశ భక్తి పెంపొందుతుందన్నారు. అలాగే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఫిట్ భారత్ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు, కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, పీఓలు ఏఎం శిరీష, డాక్టర్ డి.అప్పలరాజు, పీడీ డాక్టర్ మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా అట్లతద్దె వేడుకలు



కొంకుదురులో ఊయల ఊగుతున్న విద్యార్థినులు



రాజానగరంలో..

బిక్కవోలు: వధువులు, యువతులు అట్ల తద్దె పండగను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజామునే నిద్రలేచి పసుపుతో గౌరీదేవిని తయారు చేసి అమ్మవారికి ఆనవాయితీ ప్రకారం అట్లు వేసి నివేదించారు. అనంతరం ముత్తైదువులకు వాయినాలు ఇచ్చి ఊయలలూగి రోజంతా సరదాగా గడిపారు. సాయంత్రం వరకూ ఉపవాసం ఉండి చంద్ర దర్శనం అయ్యాక దీక్ష విరమించారు. పాఠశాలల్లో సైతం ప్రత్యేకంగా కట్టిన ఊయలలూగి విద్యార్థినులు ఆహ్లాదంగా గడిపారు.

రాజానగరం: అట్లతద్దె పండగను మహిళలు సంప్రదాయబద్ధంగా నిర్వహించుకున్నారు. ఉదయమే ఉపవాస దీక్ష ప్రారంభించి సాయంత్రం పూజ అనంతరం కాలువల్లో గౌరమ్మకు పూజలు చేశారు.

రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లే

- ఎస్పీ జగదీష్
- రక్తదాతలకు అభినందన



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్పీ జగదీష్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్టేనని ఎస్పీ పి.జగదీష్ అన్నారు. పోలీసు అమరవీరుల స్మారకోత్సవాన్ని పురస్కరించుకుని జాంపేటలోని పోలీస్ కన్వెన్షన్ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలామంది స్వచ్ఛందంగా రక్తదానం చేయటానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను, సేవలను స్ఫూర్తిగా తీసుకొని రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ పోలీస్ శాఖ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఆధ్వర్యంలో సంజీవిని బ్లడ్‌బ్యాంక్, డాక్టర్ వైఎస్సార్ జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్‌బ్యాంక్, మాగ్నా చైల్డ్ హాస్పిటల్, ధన్వంతరి బ్లడ్‌బ్యాంక్‌లు ఈ శిబిరం నిర్వహించాయి. పోలీస్ అధికారులు, సిబ్బంది, ఆర్ట్స్, లైట్, వీటి కాలేజీల విద్యార్థులు రక్తదానం చేశారు. వారందరికీ ఎస్పీ చేతుల మీదగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం తలసేమియా బాధితులతో ఎస్పీ మాట్లాడారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)ఎస్.ఆర్ రాజశేఖర్ రాజు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామయ్య పాదుకలకు ప్రత్యేక పూజలు



శ్రీరామ పాదుకలను శిరసున ధరించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు



శ్రీరామ పాదుకలు

సీటీఆర్ఐ: రామయ్య పాదుకులను శిరసున ధరించడం తన పూర్వజన్మ అదృష్టమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. అయోధ్య సీతారామచంద్ర స్వామి వారి పాదుకలను మంగళవారం స్థానిక ప్రకాశం నగర్‌లోని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్వగృహానికి తీసుకువచ్చారు. ఆ పాదుకలకు తోట సుబ్బారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు, జక్కంపూడి విజయలక్ష్మి విశేష పూజలు చేశారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ రామాయణం మన సామాజిక జీవితానికి ప్రతిబింబం లాంటిదని, ప్రతి ఒక్కరూ తప్పకుండా చదవాలన్నారు. అయోధ్య భాగ్య నగర సీతారామ సేవాఫౌండేషన్ వ్యవస్థాపకుడు చల్లా శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలన్నింటిలో స్వామి వారి పాదుకలకు పూజలు చేశామన్నారు. ఈ పాదుకలను భద్రాచలం మీదుగా రాముడు అరణ్య వాసానికి కదిలిన మార్గంలో పాదయాత్రగా సాగి జనవరి 15వ తేదీన అయోధ్య ఆలయంలో సమర్పిస్తారన్నారు. అనంతరం రాజమహేంద్రవరం గౌతమీ ఘాట్ సమీపంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శ్రీరామ పాదుకలకు తోట సుబ్బారావు సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి



పటేల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు



గైట్ ఫార్మసీ కళాశాలలో విద్యార్థుల సమైక్యతా ప్రతిజ్ఞ



ఎంపీడీఓ కార్యాలయంలో ఐక్యతా ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి



పందలపాకలో ఐక్యతా ప్రతిజ్ఞ చేస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వీసీ ఆచార్య కె.పద్మరాజు పూలమాల వేసి, నివాళులర్పించారు. ఇంగ్లాండ్‌లో బారిస్టర్ పట్టాతో దేశానికి తిరిగొచ్చిన పటేల్.. దేశ స్వాతంత్ర్యం కోసం జరిపిన పోరాటాలు, చేసిన త్యాగాలను వీసీ తెలియజేశారు. భారతదేశ ఉక్కు మనిషిగా పేరొందిన ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్, యూనివర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

గైట్‌లో సమైక్యతా దినోత్సవం

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్.రామచంద్రన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం 56 సంస్థానాలను భారత్ యూనియన్‌లో విలీనం చేయడంలో ఆయన చూపిన చొరవ చిరస్మరణీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమైక్యతా ప్రతిజ్ఞ చేయించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డి.కవిత, వలంటీర్లు పాల్గొన్నారు. అలాగే గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో పటేల్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.లీలావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పటేల్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

పెదపూడి: మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పటేల్ 148వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ వసంత మాధవి, ఎంపీడీఓ సాయిబాబు, ఈఓపీఆర్డీ ఎంసత్యనారాయణరెడ్డి, ఏపీఓ కాంచన, కాండ్రేగుల సర్పంచ్ కేవీవీ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: భారత జాతి ఐక్యతకు పునాది వేసిన మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ అని సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సూరిశెట్టి సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని పందలపాక సచివాలయం-1 వద్ద పటేల్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ పోతు మణికంఠ రంగారావు, గ్రామ వ్యవసాయ సహాయకుడు భాస్కర్ రెడ్డి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతపై ర్యాలీ

బిక్కవోలు: జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా మంగళవారం బిక్కవోలులో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో హెచ్ఎం వీర ప్రభాకరావు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలోని పాఠశాల ఉపాధ్యాయులు జంగా ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పందలపాకలో స్థానిక ఉన్నత పాఠశాల పీడీ యువరాజారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు.

సత్యసాయిబాబాకి ప్రత్యేక పూజలు



సంపరలో సత్యసాయిబాబా పూజల్లో పాల్గొన్న భక్తులు

పెదపూడి: మండలంలోని సంపరలో సత్యసాయిబాబాకి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టపర్తిలో బయలుదేరిన సత్యసాయిబాబా వారి రథయాత్ర సంపర గ్రామానికి చేరుకుంది. గ్రామంలో పండితులు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు ఘన స్వాగతం పలికారు. స్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.


జంబూపట్నంలో వైద్యశిబిరం

మధురపూడి: కోరుకొండ మండలం జంబూపట్నంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని మండలం మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు ప్రారంభించారు. కోరుకొండ పీహెచ్‌సీ డాక్టర్ రవిచంద్ర, కోటికేశవరం పీహెచ్‌సీ డాక్టర్ పుణ్యశాంతి, వైఎస్సార్ కంటి వెలుగు, గైనికాలజిస్టు, చిన్నారుల వైద్య నిపుణులు ఈ శిబిరంలో 673 మందికి వైద్యసేవలు అందించారు. ఎంపీడీపీఎస్ నరేష్‌కుమార్, సర్పంచ్ ఉల్లి అప్పన్నదొర, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు ఉల్లి గణ, మాజీ ఎంపీటీసీ ఉల్లి చెల్లారావు, జంబూపట్నం సెక్రటరీ మదర్ బీబీ పాల్గొన్నారు.

గోకవరంలో..

గోకవరం: స్థానిక సచివాలయం-4 కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల నాయకులు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సుంకర వీరబాబు ఈ వైద్య సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తే తగిన గుర్తింపు



గంగాభవాని దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రంగంపేట: ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తే విద్యార్థుల హృదయాల్లో తగిన గుర్తింపు లభిస్తుందని ప్రధానోపాధ్యాయుడు గంటా రమణబాబు అన్నారు. చండ్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు రాచకొండ నాగ గంగాభవాని స్వచ్ఛంద ఉద్యోగ విరమణ సత్కార సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు గంగాభవాని సేవలను కొనియాడారు. అనంతరం గంగాభవాని, వెంకటరమణమూర్తి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గరిమెళ్ళ అరుణ, మండల యూటీఎఫ్ అధ్యక్షుడు రాంబాబు, సీఆర్ఎంటీలు రమణ, శ్రీనివాసరాజు, ఉపాధ్యాయుడు మునుకుట్ల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

రంగంపేట: మండల పరిధిలోని జి.దొంతమూరులో మంగళవారం రంగంపేట, బిక్కవోలు, అనపర్తి మండలాల పోలీసులతో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు ఎస్ఈబీ సీఐ జి.వెంకటలక్ష్మి తెలిపారు. తనిఖీల్లో సారా కలిగి ఉన్న తొగరు సాయి, మేడిశెట్టి వెంకటేశ్వర్లును అరెస్టు చేసి వారి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న సాయి కుమారుడిపైనా కేసు నమోదు చేశామన్నారు. 100 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశామని చెప్పారు.

నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష

రంగంపేట: దాడి కేసులో నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష పడినట్టు ఎస్ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2020 ఆగస్టు 24న తన పొలంలోకి గేదెలు ఎందుకు తోలావని ప్రశ్నించిన నల్లమిల్లి గ్రామానికి చెందిన చింతలపూడి సత్యనారాయణపై చింతలపూడి శ్రీనివాస్ కత్తితో దాడి చేయడంతో రక్తం గాయాలయ్యాయి. ఆయన ఫిర్యాదుపై అప్పటి ఎస్ఐ వి.కిషోర్ కేసు నమోదు చేసి శ్రీనివాస్‌ను అరెస్ట్ చేశారు. మంగళవారం పెద్దాపురం అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జి.బుల్లమ్మ నిందితుడు శ్రీనువాస్‌కి మూడు నెలల జైలు శిక్ష విధించారని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు గళం విప్పాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు గళం విప్పాలని, సమాజ సమాన అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎసెట్ మేనేజర్ అమిత్ నారాయణ్ అన్నారు. విజిలెన్స్ అవేర్ నెస్ వీక్ 2023లో భాగంగా స్థానిక ఏవీఏ రోడ్డు నుంచి ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్ వరకూ మంగళవారం వాకథాన్ నిర్వహించారు. ఓఎన్‌జీసీ ఉద్యోగులు, కలెక్టివ్‌లు, ఎస్‌పిఎఫ్ సిబ్బందితో కూడిన దాదాపు 100 మంది పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని అమిత్ నారాయణ్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అవినీతి ముప్పుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, సత్యం వెల్లివిరిసే వాతావరణాన్ని పెంపొందించేందుకు ఈ వాకథాన్ ఒక అడుగు అన్నారు. ఈ సంవత్సరం సే నో టు కరప్షన్: కమిట్ టు ది నేషన్ అనే థీమ్‌తో అవినీతికి సంబంధించిన సమస్యలు, దానిని తగిన స్థాయిలో నివేదించడంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అనేక కార్యక్రమాలను ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ తన కార్యాచరణ ప్రాంతాల చుట్టూ, లోపల ప్రారంభించిందన్నారు. లంచ నిరోధక నిర్వహణ వ్యవస్థ కోసం ధృవీకరణ పొందిన దేశంలో మొట్టమొదటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థగా ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ చరిత్ర సృష్టించిందన్నారు.